www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025
5
చిత్తూరు



'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' ఆడియో లాంచ్

భద్రతను పరిశీలించిన జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమం బుధవారం చిత్తూరు పట్టణంలోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. ఆడియో లాంచ్ కార్యక్రమానికి సినీ ప్రముఖులు రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ, కాలేజ్ వైస్‌చైర్మన్ శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ రాజశేఖర్ రాజుతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ సౌకర్యాలు, ఎమర్జెన్సీ నిబంధనలు, ప్రసిద్ధులు, అభిమానులు రాకపోకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అలాగే ఫుల్ బాడీ చెకింగ్, డ్రోన్ పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా, శాంతియుతంగా పూర్తవడానికి ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తిగా తెలుసుకొని, దురుసు, సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనపడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ఎమర్జెన్సీ పరిస్థితులకు తగిన విధంగా స్పందించేందుకు రెడీగా ఉండాలని సూచించారు.


భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ఖైదీలకు సంకల్ప స్కిల్ ట్రైనింగ్

శిక్షణ అనంతరం ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకు రుణాలు: కలెక్టర్


ఖైదీలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వృత్తిరీత్యా నైపుణ్యం కలిగిన వారికి మాత్రమే ఉపాధి అవకాశాలు ఎక్కువ వస్తాయని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా మెరుగైన వృత్తి నైపుణ్య శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా జైలులో ఖైదీలకు సంకల్ప- స్కిల్ ట్రైనింగ్ కింద మల్టీ స్కిల్ ట్రేడ్ కింద శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసి మెకానిక్ వంటి వృత్తుల వారు నైపుణ్యాన్ని పెంపుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఖైదుల శిక్ష అనంతరం సత్ప్రవర్తనతో ఆర్థికంగా ఎదిగేందుకు సంకల్ప-స్కిల్ ట్రైనింగ్ కింద మల్టీ స్కిల్ ట్రేడ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, భవిష్యత్తులో ఈ కార్యక్రమం ద్వారా మరింత మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిఆర్‌డిఏ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారుల ద్వారా ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. తద్వారా వారు పొందిన నైపుణ్య శిక్షణ మేరకు ఉపాధి ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా ఫిబ్రవరి 18 నుండి మార్చి 24 వరకు 34 మంది ఖైదీలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఖైదీలందరికీ విజయవంతంగా శిక్షణ తరగతులు పూర్తి చేయడం జరిగిందన్నారు. మహిళా ఖైదీలకు టైలరింగ్ వృత్తిలో శిక్షణ అందిస్తే భవిష్యత్తులో ఉపాధి కలుగుతుందని కలెక్టర్‌ను కోరారు. ఓపెన్ క్లాస్ ద్వారా 10వ తరగతి చదివేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్, న్యాక్ ఏడి సతీష్ పాల్గొన్నారు.

రుణాలు తిరిగి చెల్లించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అన్యువల్ క్రెడిట్ అండ్ లైవ్ లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో డిఆర్‌డిఏ ద్వారా అమలు అవుతున్న పథకాల అమలుపై ఏపిఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి సంఘాల ద్వారా పొందే రుణాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలని తెలిపారు. రుణాలను పొందిన మహిళలు కుటుంబ అవసరాలకు రుణం వినియోగించుకోకుండా స్వయం ఉపాధిని పెంపొందించు కొనేలా కృషి చేయాలన్నారు. సంఘాల ద్వారా రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించేలా క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి రికవరీపై దృష్టి పెట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది తిరిగి చెల్లించని వారిపై సంఘ సభ్యులకు సంబంధించిన నగదును బ్యాంకులలో డిపాజిట్ చేయకుండా ఇబ్బంది పెట్టే వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు మంజూరు చేస్తే రుణాలు సద్వినియోగం చేసి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, ఈ విషయంలో ఏపిఎంలు క్షేత్రస్థాయిలో అవగాహన పెంచి సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్యువల్ క్రెడిట్ అండ్ లైవ్ లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌ను క్షేత్రస్థాయిలో పరిస్థితులను పూర్తిగా అవగాహన చేసుకుని అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించి జరుగుతున్న ఎన్యుమరేషన్ సర్వేను పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించాలని డిఆర్‌డిఏ పిడి శ్రీదేవిని ఆదేశించారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పోలీసు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల 31వ తేదీ అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ కుబేంద్రన్ సతీమణి శివానికి బుధవారం పోలీస్ సహాయనిధి నుండి లక్ష రూపాయల చెక్కు, అలాగే ఎస్.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఈనెల 1వ తేదీ అనారోగ్యంతో మరణించిన ఆనందబాబు సతీమణి మాధవికి పోలీస్ సహాయ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధిత కుటుంబానికి భరోసా ఇస్తూ, పోలీస్ డిపార్టుమెంట్ తరఫున వారి అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అందించే అన్ని న్యాయమైన సౌకర్యాలు, ఫలితాలు కూడా సమగ్రవంతంగా పొందేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.


పోలీసు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈకార్యక్రమానికి నియోజకవర్గంలోని గుడిపాల, చిత్తూరు రూరల్, చిత్తూరు నగరపాలక సంస్థ నుంచి ప్రజలు తరలివచ్చి వినతుల సమర్పించారు. ప్రధానంగా పింఛన్లు మంజూరు చేయాలని, భూ సమస్యలు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల కోసం, ఇతర వ్యక్తిగత సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే అక్కడికక్కడే అధికారులతో చర్చించి చర్యలు తీసుకున్నారు. మొత్తం 68 వినతులు, ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులు తక్షణం క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, తహశీల్దార్లు జయంతి, లోకేశ్వరీ, ఎంఈఈ.వెంకటరామి రెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్ పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఏ మురళీ మోహన్


ప్రజాశక్తి- యాదమరి: పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తోంది. బుధవారం చిత్తూరులోని లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించి గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా విని, సత్వర పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ప్రతి సమస్యను ఓపికగా ఆలకించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించగా, మరికొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించి, తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో మొత్తం 57లకు పైగా విన్నతులు అందాయి. మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్.పి.జయప్రకాష్ నాయుడు, యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, తవణంపల్లె మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, ఐరాల మండల అధ్యక్షులు గిరిధర్ బాబు పాల్గొన్నారు.

పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించేందుకు

వీడియో, షార్ట్ ఫిలిమ్ పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా పరిధిలో పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించాలని, ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలియాజేయాలని, గర్భస్థ పిండలింగ నిర్ధారణ పరీక్షలు చట్టపరంగా నేరమని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇందుకోసం 30 సెకండ్ల వీడియో, షార్ట్ ఫిలిం చిత్రీకరణ పోటీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలో ఉత్తమంగా ఎంపికైన వీడియోలకు ఒకటవ, రెండవ, మూడవ బహుమతులు, పారితోషికాలు కలెక్టర్ చేతుల మీదుగా అందజేయబడతాయని తెలిపారు. ఈ పోటీలో విద్యార్థులు, యువకులు, ప్రజలు చైతన్యాన్ని పెంచేలా వీడియోలు రూపొందించి తమ వంతు సహాయాన్ని సమాజానికి సానుకూల మార్పు అవగాహన తీసుకురావడానికి అందరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ వీడియోలను 15 రోజుల లోపల డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆఫీస్ డెమో సెక్షన్ (ఫోన్ నెంబర్ 9949236530) సంప్రదించాలని కోరారు.

ప్రతి గ్రామం అభివృద్ధిలో ముందంజ వేయాలి


సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- యాదమరి: పూతలపట్టు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు బుధవారం పండుగల వాతావరణాన్ని తలపించాయి. మండలంలోని దాసరపల్లి గ్రామపంచాయతీలోని ఆరిమాకులపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డును చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ ప్రారంభించారు. ఎంపి, ఎమ్మెల్యేలను మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం మొలకమడుగు గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో మారుమూల గ్రామాలు, పంచాయతీలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ రెండు కళ్లుగా భావించి ప్రతి పేద కుటుంబానికి మంచి జరిగేలా పని చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతోనే ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం విజయవంతమవుతుందని, ప్రతి గ్రామంలో మార్పు తీసుకుని రావాలనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్.రాజన్, తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, మండల అధ్యక్షులు మొరార్జీ కార్యదర్శి రబ్బి, చిత్రా నాయుడు, హిమగిరి, చిట్టి నాయుడు గోపి పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న ప్రజలపై దాడులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- విజయపురం

నగరి మండలం మున్సిపాలిటీ పరిధిలో ఏకాంబర కుప్పం పంచాయతీ పరిధిలో ధరణి సమీప కుశస్థలి నదిలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ జరుగుతూనే ఉంది. దీనిపై స్థానికులు ఎన్నిసార్లు అధికారులకు సమాచారం అందవేసిన ఏమాత్రం ప్రయోజనం లేదు.. ఇక్కడున్న ట్రాక్టర్ యజమానులైతే యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ అడిగిన వారిపై రెచ్చిపోతున్నారు. పగటిపూట ఇసుకను డంప్ చేసి రాత్రిపూట తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇంతకుముందు కూడా ఇదే విధంగా డంప్ చేసి తరలిస్తున్న ఇసుకను పోలీసులు పట్టుకున్నారు.. అయినా కూడా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. అంతేకాకుండా పక్కనే ఉన్న దళిత వాడ శ్మశాన వాటికను సైతం పూర్తిగా తోడేశారు. ప్రజలు వెళ్లి అడ్డుకుంటే వారి మీద దాడి చేస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించిన పోలీసులు వచ్చే లోపు ట్రాక్టర్ యజమానులు పారిపోతున్నారు. వందకు పైగా ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నాయి. ఒక్క ట్రాక్టర్ కూడా లైసెన్స్ లేదు, పర్మిట్ లేదు. ట్రాక్టర్లు నడిపే స్పీడ్‌కి ప్రజలు రోడ్డుకు రావాలంటే భయపడుతున్నారు. మండలానికి సంబంధించిన అధికారులు దీనిపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇదేవిధంగా కొనసాగితే రోడ్డుపైకి వచ్చి పోరాడే పరిస్థితి వస్తుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.


కుశస్థలి నదిలో ట్రాక్టర్ల ద్వారా తరలిపోతున్న ఇసుక

పీపీపీ మోడల్‌లో పలమనేరు బస్టాండ్ అభివృద్ధి

నూతన హంగులతో నిర్మాణానికి ప్రణాళికలు
ఆర్టీసీ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండు రూపు రేఖలు మారనున్నాయి. ఇక్కడి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవతో ప్రభుత్వం ఈ బస్టాండ్‌ను పీపీపీ (ప్రభుత్వం, ప్రజలు, ప్రైవేట్) విధానం ద్వారా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసింది. ఈ విధానం ద్వారా ప్రస్తుత బస్టాండ్ దశ దిశ మారడమే గాక ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగానూ నిలవనుంది. ప్రస్తుతం ఇక్కడ నాలుగు ఫ్లాట్ ఫాంలు మాత్రమే కలిగి ఉండడంతో ప్రయాణికుల రద్దీతో ఏమాత్రం సరిపోవడం లేదు. దీనికి తోడు గత ప్రభుత్వంలో దాదాపు 13 సర్వీసులను అప్పటి ప్రజాప్రతినిధులు ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఎంతో ప్రాశస్త్యం ఉన్న డిపో, బస్టాండ్‌లు వెలవెలపోయే పరిస్థితికి చేరింది. ఇలా ఉండగా స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి డిపో పూర్వ వైభవానికి పూనుకున్నారు. అందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన రెండు మూడు నెలల్లోనే నూతన సర్వీసులను ఆయన ప్రారంభించారు. అందులో భాగంగా ప్రస్తుతం బస్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పీపీపీ విధానం ద్వారా బస్టాండ్లో సుమారు పది ఫ్లాట్ ఫామ్‌ల ఏర్పాటుతో పాటు షాపింగ్ గదుల నిర్మాణం ప్రయాణికులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో డిపో మేనేజర్ స్వామితో కలసి సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆ కోణంలో ప్రణాకలు రూపొందించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఇక్కడి నుంచి తరలించిన బస్సు సర్వీసులు త్వరలోనే తిరిగి పునరుద్ధరించేలా చూడాలని ఆయన ఆదేశించారు. గురువారం బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం- దాసర్ల పల్లె సర్వీసును ప్రారంభించినట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.


ఆర్టీసీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

రేపు ఉద్యాన పంటల పై సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): జిల్లా కేంద్రంలోని ఎన్‌పిసి పెవిలియన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 11వ తేదీ ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యాన పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మామిడి, టమోటా పంటలు ప్రధానమైన పంటలుగా ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా 72 వేల హెక్టార్లలలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా మామిడి 25 మండలాల్లో ప్రధాన పంటగా ఉందని, మామిడిలో తోతాపురి ఎక్కువగా సాగులో ఉండడం వల్ల దిగుబడి ప్రతి ఏటా లభించడం వల్ల మామిడి గుజ్జు పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయని, ఫలితంగా మామిడి గుజ్జు తయారీకి చిత్తూరు ప్రధాన కేంద్రంగా మారిందన్నారు. పరిశ్రమలతో పాటు మామిడి విస్తీర్ణం పెరుగుతూ వచ్చిందని, పరిశ్రమలపైన మామిడి రైతులు మామిడి పంట విస్తీర్ణులపైన పరిశ్రమ ఆధారపడి ఉన్నాయన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మామిడి పంట, దిగుబడి నిలకడగా లేకపోవడం వల్ల మామిడి గుజ్జు ఎగుమతులపై ప్రభావం చూపిందని, ఈ దిశలో మామిడి పంటకు స్థిరత్వం చేకూర్చడంతో పాటు మామిడి స్థానంలో ప్రత్యామ్నాయ పంటలసాగు నుప్రోత్సహించేందుకు ఇందుకు సంబంధించిన అవగాహన కల్పించేందుకు రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యాన పంటల ఈకార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందన్నారు. కనుక రైతు సోదరులు ఈ అవగాహన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

జూనియర్ రెడ్ క్రాస్ బృందాన్ని అభినందించిన కలెక్టరు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతీయ స్థాయిలో పాల్గొని అవార్డులు సాధించిన రెడ్‌క్రాస్ విద్యార్థులను, రాష్ట్ర రెడ్‌క్రాస్ బృందాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభా కనపరిచి అవార్డులు తీసుకొచ్చి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆ బృందాన్ని అభినందించారు. మార్చి 24 నుండి 28వ తేదీ వరకు ఒడిస్సా రెడ్‌క్రాస్ సొసైటీ భుబనేశ్వర్‌లో నిర్వహించిన అంతర్రాష్ట్ర జూనియర్ రెడ్ క్రాస్ విద్య, శిక్షణ క్యాంపుకు ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ 4 జిల్లాల నుండి 19మంది జేఆర్సి విద్యార్థులు, విజయం కాలేజ్ చౌదరి, రాజమండ్రి విజయ కుమారి కాగా స్టేట్ కౌన్సిలర్‌గా చిత్తూరు రెడ్ క్రాస్ నుండి చిరంజీవితోపాటుగా అంతర్రాష్ట్ర క్యాంపులో 7 రాష్ట్రాల నుండి విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ అంతరాష్ట్ర క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ జూనియర్ రెడ్ క్రాస్ బృందం ఉత్తమ కౌన్సిలర్, ఉత్తమ రాష్ట్ర జెఆర్‌సి బృందంకు ఒడిషా రెడ్‌క్రాస్ జనరల్ సెక్రెటరీ విశ్రాంత ఐఏఎస్ గణేష్ చంద్ర పాత్ర ద్వారా అవార్డులు అందుకోవడం జరిగింది. డిఆర్‌ఓ మోహన్ కుమార్, రెడ్ క్రాస్ చైర్మన్ వి.రమేష్ బాబు, కోశాధికారి డాక్టర్ ఎం.తేజోమూర్తి, ఎంసి సభ్యులు ఎంఆర్.అరుణ కుమారి, జిల్లా కార్యదర్శి ఆర్.సహదేవ నాయుడు, పరిపాలన అధికారి గోపి, జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి, చౌదరి, జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం

యుటిఎఫ్ పోస్టర్ ఆవిష్కరించిన డీఈవో వరలక్ష్మి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ బడులలో విద్యార్థులు చేర్పిద్దామని యుటిఎఫ్ రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి బుధవారం చిత్తూరు విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ బడిని కాపాడుకుందాం, యుటియఫ్ ప్రజలను కూడగట్టి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునేలా పనిచేయడం అభినందనీయమన్నారు. యుటిఎఫ్ సామాజిక స్పృహకలిగిన సంఘంగా హక్కుల కోసం పోరాడుతూనే ప్రభుత్వ విద్యారంగంలోనూ పేదలకు, బలహీన వర్గాలకు చదువు అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే కృషి మనమందరం చేపట్టాలని, ఆ కృషిలో భాగంగా పతి ఒక్క తల్లిదండ్రులను కలిసి ఒప్పించండి, బడిఈడు పిల్లలందరిని మన ప్రభుత్వ బడులలో చేర్పించండి ఉపాధ్యాయులుగా మన వంతు కర్తవ్యంగా చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీరమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్, జిల్లా సహాధ్యక్షులు రెహానాబేగం, కె.రెడ్డెప్ప నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, జిల్లా కార్యదర్శులు ఎం.పార్థసారథి, ఏకాంబరం, కె.గణేష్ కుమార్, ఎంవి.రమణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సాధన కుమార్, నాయకులు సర్దార్, ఎస్‌సి రాజేష్ కుమార్, సురేష్ బాబు, గంగా ప్రసాద్ రాజు, సికిందర్ పాల్గొన్నారు.

టిడిపిలో సభ్యత్వం.. గర్వకారణం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం పొందడం, పార్టీలో కుటుంబ సభ్యులుగా చేరడం ఎంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఇటీవల చేపట్టిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎమ్మెల్యే గురజాల పార్టీ శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులు బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి అందాయి. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు సునీల్ కుమార్ బుధవారం ఎమ్మెల్యే శాశ్వత సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డును ఎమ్మెల్యేకి అందించారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు పట్టణం జిల్లా పరిషత్ బంగ్లాలో బుధవారం టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు రెడ్డి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని అన్నారు. రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, పులిచెర్ల, రొంపిచర్ల మండలం నాయకులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌ను అభినందించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: విజయవాడలో డ్రోన్ శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన గంగాధర నెల్లూరు మండలంలోని పాతపాళ్యం దళితవాడకు చెందిన చంద్రశేఖర్‌ను ప్రభుత్వ విప్, డాక్టర్ వి.ఎం.థామస్ అభినందించారు. బుధవారం వ్యవసాయశాఖ అధికారులకు ఇచ్చి సర్టిఫికెట్‌ను టిడిపి నేతల సమక్షంలో చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే థామస్ అందజేశారు. పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణం నాయుడు, తూగుండ్రం గ్రామకమిటీ అధ్యక్షులు నీరజాక్షులురెడ్డి, నియోజకవర్గం ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ, జీవరత్నం, శాంతకుమార్, నరసింహులు నాయుడు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



ప్రజాశక్తి- గంగవరం: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ, పోరం లేని కారణంగా వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన సమావేశానికి 3.30 గంటలు అయినా ఎంపిటిసిలు, సర్పంచ్లు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, ఎంపిడిఓ సిబ్బంది మాట్లాడుతూ ఎంపిడిఓ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని, ప్రజాప్రతినిధుల పట్ల చులకన భావం, కార్యాలయంలో కనీస మౌలిక సదుపాయాలు, తాగునీరు సైతం కల్పించడం లేదని ఆరోపించారు. పంచాయతీలకు సైతం నిధులు కేటాయించడంలో వివక్ష చూపుతున్నారని, అధికార పార్టీ సర్పంచులకు మాత్రమే నిధులు మంజురు చేసి మిగిలిన పంచాయతీలకు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. ఏదైనా పనిపైన ఎంపిడిఓ ఆఫీసుకు వచ్చినా ఎంపిడిఓ అందుబాటులో ఉండటం లేదని, పనుల నిమిత్తం వచ్చే వారు పలుమార్లు వెనుదిగాల్సి వస్తోందనా వాపోయారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాని అంటున్నారు.

భూ రీసర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి- యాదమరి: ప్రభుత్వం చేపడుతున్న భూ రీసర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ పార్థసారథి కోరారు. బుధవారం కోనాపల్లి పీర్యంబడి రెవెన్యూ గ్రామాల్లో రైతులతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూ రీసర్వే కార్యక్రమం మరింత పగడ్బందీగా చేపట్టి ప్రజలకు పారదర్శకంగా భూములను రీ సర్వే చేపడుతుందని తెలిపారు. కోనాపల్లి పెర్యంబడి రెవెన్యూ గ్రామాల్లోని రైతులు రీ సర్వేకు సహకరించాలని కోరారు. గ్రామంలో పొలాల సరిహద్దులు గుర్తించేటప్పుడు సర్వే సిబ్బంది ముందుగా మీకు సమాచారం తెలియజేస్తారని రైతుల సమక్షంలోనే సాగు చేస్తున్న భూముల హద్దులు విస్తీర్ణం గుర్తించడం జరుగుతుందన్నారు. భూ రీ సర్వేలో ప్రతి రైతును భాగస్వామ్యం చేసి వారి సమక్షంలోనే వారు అనుభవిస్తున్న భూములను సర్వే చేసి బౌండరీస్ గుర్తిస్తారని తెలిపారు. అనంతరం రీసర్వేపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, మండల సర్వేయర్ వంశీధర్, వీఆర్వోలు సుబ్బలక్ష్మి, సుబ్బయ్య పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట బస్టాండులో చలివేంద్రాన్ని ఎంపీడీవో నారాయణ, ఈఓఆర్డి లక్ష్మి దేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించేందుకు, పాదచారులకు చల్లటి కుండనీరు అందజేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు స్వచ్ఛమైన తాగునీటిని కుండలలో పోసి చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ రెడ్డప్ప తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మేనక, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు, టిడిపి నాయకులు ఉప్పలపాటి భాను ప్రకాష్ నాయుడు, చంద్రన్న, ఏఎన్ఎం మదనిక పాల్గొన్నారు.

గంగవరం: బుధవారం పంచాయతీ కార్యాలయంలో సచివాలయాలలో ఈవోఆర్‌డి సుధాకర్ రావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. పలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే అర్జీదారులు వేసవి తాపం నుంచి కాపాడుకోవడానికి రోజు స్వచ్ఛమైన తాగునీటితో కుండల్లో నింపనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర మంత్రిని కలిసిన శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను బుధవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీధర్ యాదవ్ తెలిపారు. బీసీల అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు.



తిరుపతి -కాట్పాడి డబుల్‌లైన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తిరుపతి- కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్‌కు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు కృషితో కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, తిరుపతి- కాట్పాడి వయా చిత్తూరు రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్రం రూ.1332కోట్లు మంజూరు చేసిందని రైల్వే అధికారులు తెలిపారు. 104 కి.మీల డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపిందని, చిత్తూరు అభివృద్ధికి ఇది ఒక కీలక అడుగు కాబోతుంది. ఇప్పటికే చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ రూ.2కోట్లతో జరుగుతోంది. తిరుపతి నుండీ కాట్పాడి వరకు డబుల్ ట్రాక్ ఏర్పాటుతో చిత్తూరు రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణం చేసే ట్రైన్స్ సంఖ్య పెరగడంతో మరిన్ని ట్రైన్లు చిత్తూరులో ఆగే అవకాశమున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి- కుప్పం రూరల్: పేదల పాలిటీ కల్పవృక్షంలా ముఖ్యమంత్రి సహాయ నిధి పనిచేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నములు తెలిపారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా కంగుంది పంచాయతీ రామగుట్ట చేన్లు గ్రామానికి చెందిన కదిరివేలుకు రూ.1,53,000లు, తిర్లబండ గ్రామానికి చెందిన ఆనంద్‌కు రూ.53,000లు, సాహెపురం గ్రామానికి చెందిన షేక్ చాందినికి రూ.78 వేలు చెక్కుల రూపంలో అందజేశారు. మండల అధ్యక్షులు ప్రేమ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ మహేంద్ర, ఏవి రవి పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండండి: ఎంపీ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎండలు మండుతున్నాయని, వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండటానికి ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చిత్తూరు ప్రజలకు సూచించారు. పెరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరులోని సిఎస్ఐ చర్చిలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపును ఎంపీ ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెడికల్ క్యాంపు నిర్వహించిన పెరికే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పెరికే వరప్రసాద్‌ను ఎంపి అభినందించారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఆయన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, చర్చి మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ



ప్రజాశక్తి- పలమనేరు: సమాజసేవలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బెంగుళూరుకు చెందిన రైజ్ బయోనిక్స్, పలమనేరు హెల్పింగ్ హాండ్స్, జాయినింగ్ ద డాట్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా అమర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు నిర్వాహకులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం 27 మంది లబ్దిదారులకు ఆయన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. బెంగుళూరుకు చెందిన రైజ్ బయోనిక్స్ సీఈఓ అరుణ్, జాయినింగ్ ద డాట్స్ నిర్వహకులు ధనంజయ, శ్రీపురం సీతారామయ్య, పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ శివ, జ్ఞానేష్, శక్తి, లోకేష్, చీఫ్ మొబలైజేషన్ ఆఫీసర్ జయప్రకాశ్ నాయుడు, తులసీనాథం పాల్గొన్నారు.

సముదాయానికి మోక్షమెప్పుడో..?

అసంపూర్తిగా దుకాణాల నిర్మాణాలు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం

వ్యవసాయ మార్కెట్ ఆదాయం వృద్ధే లక్ష్యంగా నిర్మించిన దుకాణాల సముదాయం రెండేళ్లుగా పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయి అసంపూర్తిగా ఉంచిపోయింది. ఫలితంగా రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి తిప్పలు తప్పడం లేదు. అసలు ఈ సముదాయం ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయంలో సందిగ్ధత నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె, యాదమరి మండలాలు, పలమనేరు, కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాల నుంచి మామిడి కాయలను మార్కెట్‌కు రైతులు తరలిస్తారు. రైతుల సౌలభ్యం కోసం గత ప్రభుత్వం హయంలో రూ.50లక్షలతో మార్కెట్ యార్డు వద్ద తొమ్మిది దుకాణాల సముదాయ నిర్మాణపనులను గుత్తేదారుకు అప్పగించారు. ఈదుకాణాల సముదాయంలో అవసరమైన తినుబండాలు, ఇతరత్రా వస్తువుల విక్రయించేందుకు వీలుగా పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారు పనులు అసంపూర్తిగా వదిలేశారు. దుకాణ సముదాయంలో ఫ్లోరింగ్, విద్యుత్తు సౌకర్యం, దుకాణాలకు షట్టర్ల అమరిక పనులు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. అసలు వీటిని పూర్తి చేసి ఎప్పటికి అందుబాటులోకి తీసుకొస్తారన్నది నేటి ప్రశ్న. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రాబోవు మామిడి సీజన్ కన్నా ప్రారంభోత్సవాలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అశ్రునయనాలతో కానిస్టేబుల్ అంతిమ యాత్ర

జయప్రకాష్ కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ



ప్రజాశక్తి- చౌడేపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కానిస్టేబుల్ జయప్రకాష్ కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తోటి జయప్రకాష్ (వయసు 41) కుమారుడి వైద్యం కోసం శనివారం కుమారున్ని తీసుకొని బెంగళూరులో ఆసుపత్రికి వెళుత్తుండగా బెంగళూరు మార్గమధ్యంలో జయనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు కాగా స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి కానిస్టేబుల్ మృతి చెందారు. కానిస్టేబుల్ జయప్రకాష్ మృతిపట్ల అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన మృతిపట్ల మదనపల్లి తాలూకా ఇన్స్పెక్టర్, కళా వెంకటరమణ, చౌడేపల్లి ఎస్ఐ, వి.నాగేశ్వరరావు. మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, సహోద్యోగులు చిత్తూరు జిల్లాలోని చౌడేపల్లి మండలం, చింతమాకులపల్లె పంచాయతీ, బయపల్లి గ్రామంలో వారి స్వగృహంలో ఉన్న ఆయన భౌతిక కాయానికి సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతునికి భార్య కిరణ్మయి, కుమారుడు భవేష్ ఉన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు కుటుంబ సభ్యులను పరామర్శించి, దహన సంస్కారాల నిమిత్తం లక్ష రూపాయలు అందజేశారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: పారిశుధ్యం మెరుగ్గా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి కె.సుధాకర్రావు కోరారు. బుధవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం, సురేంద్రనగరం పంచాయతీలలో చేపడుతున్న పారిశుధ్య పనుల పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి పారిశుధ్యం లోపం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించినట్లయితే పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యమే కారణమన్నారు. అధికారులు పారిశుధ్యం మెరుగుపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్యం మెరుగులో భాగంగా రోడ్లపై వేసిన పేడ దిబ్బలను జేసీబీ యంత్రాల ద్వారా తొలగించారు. అలాగే డీఎం పురం గ్రామంలో ఉన్న ఫ్రంట్‌అఫ్ ఆయుష్ ఆయుర్వేద వైద్యశాలను సందర్శించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. డీఎంపురం చెత్తసేకరణ కేంద్రాన్ని సందర్శించారు. కార్వేటినగరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచులు ధనంజయవర్మ, పెరియస్వామిరెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, ఇన్చార్జి ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ, కార్యదర్శులు హరికృష్ణ, సెల్వి పాల్గొన్నారు.



జేసీబీతో పేడ దిబ్బలను తొలగిస్తున్న డీపీవో సుధాకర్రావు

దోమల నివారణపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం సబ్ యూనిట్ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఫైలేరియా కిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఇచ్చి హైజిన్ ఎలా పాటించాలి, అలాగే డీఈసీ మందులను వేసుకునే పద్ధతిని తెలియజేశారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి రసాయనాలను స్ప్రే చేయించాలని, కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత కారణంగా మూతలేని నీటి నిల్వలతో డెంగీ దోమలు కనిపిస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని లార్వాలు ఉన్న అన్ని ఏరియాలలో స్ప్రేయింగ్ చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో నిర్వహించాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.



వైద్యఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న వేణుగోపాల్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, డిఆర్‌డిఎ అనుబంధ శాఖలకు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణా కార్యక్రమం జరిగింది. వెలుగు ఏపీఎం పరశురామ్ మాట్లాడుతూ రైతులు అందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. ప్రతి మహిళా రైతు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అభివృద్ధి చెందగలమని ఆశాభవం వ్యక్తం చేశారు. పంటకు ముందు నవధాన్యాలు చల్లుకొని పంటలు పెట్టుకోవడం వలన భూసారం పెరుగుతుందన్నారు. దేశవాలి ఆవులు పేడ మూత్రంతో పంటలు పండించి దిగుబడి పెంచుకోవాలని తెలియజేశారు. రాబోవు ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు ప్రణాళికకు కావలసిన సహాయ సహకారాలు అందించగలమని తెలియజేశారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి సురేఖ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఇస్తున్న సూచనలు సలహాలు పాటించాలని కోరారు. ఎన్‌పిఎం ఎంటి సుధాకర్ నాయుడు మాట్లాడుతూ భూసారం పెంచే ఘన ద్రవ జీవా మృతాలు, విత్తనశుద్ధి బీజామృతం గురించి, ద్రావణాలు, కసాయాలు గురించి తెలియజేశారు. డివిజనల్ మాస్టర్ ట్రైనర్ హనుమంతు మాట్లాడుతూ నేలను సంవత్సరం పొడవునా పంటలతో కప్పి ఉండే విధంగా పంటకు పంటకు మధ్యలో బీడు లేకుండా నవధాన్యాలు చల్లుకొని విధానం 9 సార్వత్రిక సూత్రాలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ రైతులు ధనంజయ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ రెడ్డి, యధవర్ధన్ రెడ్డి తమ పొలంలో పాటించిన పద్ధతులు అనుభవాలను తోటి రైతులకు తెలియజేశారు. డిఎంఎంటి సురేష్, యూనిట్ ఇంఛార్జి మురళి, ఐసిఆర్‌పిలు, చెంచులక్ష్మి, గౌరీ పాల్గొన్నారు.



యాదమరి: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి చరిత అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఈశ్వరి మహిళా రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని సూచించారు. రసాయన ఎరువులు వినియోగం వలన పంటల విషతుల్యం అవుతాయని తెలియజేశారు. శిక్షణ పొందుతున్న రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చూడాలని పంటల సాగు కి ముందు నవధాన్యాలు (పిఎండిఎస్) విత్తనాలు వెదజల్లి పంటలు సాగుచేయడం వలన భూసారం పెరుగుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక సూత్రాల గురించి, ఏటీఎం ఏ గ్రేడ్ మోడల్ గురించి తెలియజేశారు. ఏపీఎం ఈశ్వరి, ఎన్ఎఫ్ఏ కవిత, యుటి పార్వతి, ఐసిఆర్, వీఓఏలు వెలుగు సిబ్బంది రైతులు పాల్గొన్నారు

రొంపిచర్ల: రొంపిచర్ల మండలం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అవగాహన సదస్సును నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూమి నాణ్యత కోల్పోతుందని, కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత ఆ భూమిలో ఎలాంటి పంటలు పండించడానికి ఉపయోగపడదని, ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి నాణ్యత పెరిగి ఎలాంటి కాల పరిస్థితుల్లోనైనా పంటలు పండించుకోవడానికి ఆస్కారం అవుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వల్ల సంవత్సరం అంతా పంటలు పండించుకోవచ్చునని తెలిపారు. పెరటి తోటల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగించుకోవాలని సూచించారు. వెలుగు ఏపీఎం ఏ.హరినాథ్, వ్యవసాయ అధికారులు, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కుప్పం టౌన్:



కుప్పం పట్టణ పరిధిలో జరిగిన రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పట్టణ రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే గేటు ముందు జరిగిన ప్రమాదాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల ప్రాంతంలో అమృత ఎక్స్ప్రెస్ వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, ప్రమాదంలో మరణించిన వ్యక్తి తెలుపు జీన్స్ ప్యాంట్, ఎరుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడని, అతని వయసు సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చని, జరిగిన ప్రమాదాన్ని బట్టి మృతుడు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి ఉండవచ్చని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతుడు 2 కాళు పోగొట్టుకోగా, క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మరణించినట్టు ధృవీకరించారని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

వీధి కుక్కల దాడిలో లేగ దూడ మృతి

ప్రజాశక్తి- సోమల:



మండల కేంద్రమైన సోమల పంచాయతీ అడుసుపల్లి, బుంగవారిపల్లి గ్రామాల్లో గత మూడు రోజులుగా వీధి కుక్కల దాడిలో దాదాపు 6 లేగ దూడలు తీవ్రగాయాల పాలై మృత్యువాత పడినట్లు గ్రామస్తులు తెలిపారు. పగలంతా పొలాల వద్ద ఆవు దూడలను మేపుకొని సాయంత్రం ఇంటికి తీసుకువచ్చి పాలు పిండి ఇంటి వద్ద కట్టి ఉంచి మేత వేసి రైతులు తమ ఇళ్లల్లో గాఢ నిద్రలో ఉంటున్న సమయంలో రాత్రి 12 గంటల నుండి మూడు గంటల మధ్య ప్రాంతంలో వీధి కుక్కలు లేగ దూడలపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని గాయపడ్డ లేగ దూడలు సుమారు ఐదు, ఆరు గంటల తర్వాత మృత్యువాత పడుతున్నాయని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. సాయంత్రం వేళల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులను కూడా కుక్కలు కరిచేందుకు మీదకు వస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని కుక్కల బెడద నుండి తమ గ్రామాన్ని మూగజీవాలను రక్షించాలని ఇందుకోసం పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేస్తున్నారు. మూడు రోజుల వ్యవధిలో గ్రామంలోని శెట్టి వారి రాంబాబుకు చెందిన రెండు దూడలు, యనమల దేవేంద్రకు చెందిన ఒక దూడ, గౌతకట్ల హరికి చెందిన ఒక దూడ, గరుడప్ప గారి నాగమల్లయ్యకు చెందిన ఒక దూడ కుక్కల దాడిలో గాయపడి మృత్యువాత పడ్డాయి. బత్తల శారదకు చెందిన దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వీటిలో అధికంగా పేయదూడలు ఉండడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

లక్ష్మయ్య మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి- కార్వేటినగరం: వైసిపి సీనియర్ నాయకుడు టీ.లక్ష్మయ్య (74)మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. లక్ష్మయ్య మృతి చెందిన సమాచారాన్ని అందుకున్న నారాయణస్వామి బుధవారం కార్వేటినగరం పెద్ద దళితవాడకు చేరుకున్ని ఆయన మృత దేహంపై పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారి కటుంబాన్ని ఓదార్చారు. అలాగే ఎంపీపీ లతాబాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, మండల కన్వీనర్ శేఖర్రాజు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, ఎంపీటీసీ ధనరాజ్ పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.

ధరలను నియంత్రించాలి: సిపిఐ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా బుధవారం చిత్తూరు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిపిఐ నాయకులు నిరసన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడానికి బిజెపి మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 11సంవత్సరాలు కావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా నిత్యావసర వస్తువులు ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలకు ఒక పూట మంచి భోజనం తినలేని పరిస్థితికి తెచ్చిందన్నారు. సంస్కరణల పేరుతో కరెంటు చార్జీలు పెంచడంతో ప్రజలు కరెంట్ ఛార్జీలు కట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను ఉపసంహరించకపోతే ప్రజలే తగిన బుద్ధిచెప్తారని హెచ్చరించారు.

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గ్రామపంచాయతీలలో 15 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పచ్చికాపలం గ్రామకార్యదర్శి సాయిభవాని ఆధ్వర్యంలో బుధవారం పచ్చికాపల్లం గ్రామపంచాయతీలోని పెద్ద పోడుచేను గ్రామశివారులో రోడ్డు పక్కనున్న చెత్తకుప్పలను జెసిబి ద్వారా తొలగించారు. పారిశుధ్య పనులను మండల అభివృద్ధి అధికారి పురుషోత్తం పరిశీలించారు. మిగిలిన రోజుల్లోకూడా ఇదేవిధంగా పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ, మహిళా సంరక్షణ కార్యదర్శి భాగ్యం, సంక్షేమ విద్యా సహాయకుడు సుదర్శన్, గ్రీన్ అంబాసిడర్లు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పిఎంఎస్ఎంఏవై కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు జయసింహ, ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా తొమ్మిదవ తేదీ గర్భవతులు క్రమం తప్పకుండా ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని వైద్యుల సలహాలు సూచనలు తప్పక పాటించాలని సూచించారు. బిపి షుగర్ రక్త పరీక్షలను నిర్వహించి ఐరన్ లోపం ఉన్నవారికి మాత్రలను మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సి.హెచ్.ఓ అమర్నాథ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భవతులందరిని పరీక్షించి, వైద్య సేవలను అందించినట్లు డాక్టర్ గౌరీ తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కేశవరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీ కేశవ రెడ్డి రెడ్ క్రాస్ అధ్యక్షులు గర్భిణులకు ఉచితంగా అన్నదానం చేశారు. గంగాధర నెల్లూరు రెడ్ క్రాస్ ఇంచార్జ్ పాపిరెడ్డి, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.